ఒంటికాలిపై నిరసన

సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం నాటికి 12వ రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలో కార్మికులు భిక్షాటన చేశారు. బిజినేపల్లిలో ఒంటికాలిపై నిరసన తెలిపారు. తెలకపల్లి మండలం రాకొండలో రాస్తారోకో చేపట్టారు. పెద్దకొత్తపల్లి, కల్వకుర్తి రూరల్ పరిధి, పెంట్లవెల్లి, బల్మూరులో ఏఐవైఎఫ్, సీఐటీయూ, కేవీపీఎస్, సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. అమ్రాబాద్‌లో ఎస్ఐ మద్దతు తెలిపారు. తాడూరులో ర్యాలీ నిర్వహించారు. కొల్లాపూర్‌లో వంటావార్పు చేశారు. కోడేరు, వెల్దండ మండలాల్లో సమ్మె శిబిరాలు కొనసాగాయి.

– సాక్షి, నెట్‌వర్క్


నాగర్‌కర్నూల్‌లో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు


బిజినేపల్లిలో ఒంటికాలుపై నిరసన ..


బల్మూర్‌లో..


వెల్దండలో..

వర్గీకరణ కుట్రలు సహించం


మాల మహానాడు మండల కమిటీతో రాష్ట్ర ప్రతినిధి శ్రీశైలం

బల్మూర్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు వత్తాసుపలుకుతోందని ఈ నిర్ణయాన్ని ఖండిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర ప్రతినిధి పాత్కుల శ్రీశైలం అన్నారు. సోమవారం మండలంలోని జినుకుంటలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో రాజకీయ పార్టీలు తమ వైఖరి మార్చుకోక పోతే మాలల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

మండల కమిటీ ఎన్నిక..

మండల అధ్యక్షుడిగా ఎల్లికంటి పాండు, ఉపాధ్యక్షుడిగా కురుమయ్య, గోరటి సైదులు, ప్రధాన కార్యదర్శిగా మస్తాన్, కార్యదర్శులుగా పిల్లిశ్రీను, లక్ష్మయ్య, పోగుల రవి, గంగాధర్, సాయిని లక్ష్మయ్య, అధికార ప్రతినిధిగా వెంకటనారాయణలను ఎన్నుకున్నారు. అదేవిధంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాత్కుల సాయిరాం, కోశాధికారిగా మల్లేష్‌తో పాటు గౌరవ సలహాదారులుగా సాయిని కురుమయ్య, గోరటి శ్రీనువాసులు, పంబ బాలరాజులను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బిసమొల్ల ఆనంద్, లక్ష్మీపతి, అనిల్‌కుమార్, కిన్నెర పాండు, గోరటి సుదర్శన్, పుల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

మన్ననూర్: దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని అచ్చంపేట ఏరియా టీమ్ లీడర్ రామ్మోహన్ అన్నారు. సోమవారం పట్టణంలోని కమ్యూనిటీ హాల్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సీబీఆర్ కల్చర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ దివ్యాంగుల సమస్యలు, స్థితిగతులను తెలుసుకున్నారు. సమాజంలో నడవడిక ఎలా ఉండాలో వివరించారు. అంతకు ముందు మురళి కళాబృందం సభ్యులు ఆట, పాటల సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రదర్శించిన తీరు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ ఇండియా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ఆర్డీటీ కల్చరల్ ఆర్గనైజర్ పురుశోత్తం, వెంకటేశ్వర్లు, రాజు, నవీన్, ప్రసాద్, రామ్మోహన్, జోగిరాం, తిరుపతి, సంతోష్, సూర్యం, పద్మ, రాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి రేవంత్‌రెడ్డి



ఉప్పునుంతల: టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి అని రైతులకు మూడుగంటల ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతుందన్న వ్యాఖ్యలతో ఆయన నిజస్వరూపం బయటపడిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతు నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ, పాల శీతలీకరణ కేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

మండలంలోని తాడూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ అమ్మవారి ఉత్సవాల్లో సోమవారం ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు, యాదవ సంఘం నాయకులు ఉన్నారు.

జనాభా దామాషా ప్రకారం బీసీలకు టికెట్లు

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు అధికంగా సీట్లు కేటాయించాలని ఆ సంఘం నాయకులు కాళ్ల నిరంజన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 60 శాతం ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉదయ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ బీసీలకు 50 శాతం సీట్లు ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. మిగతా పార్టీలు కూడా వెంటనే సీట్ల వివరాలు వెల్లడించాలని కోరారు.

రథయాత్రకు తరలిన ఉద్యోగులు

వెల్దండ: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌తో సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించిన సంకల్ప రథయాత్రకు వెల్దండ మండలంలో ఆయాశాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో సైదులు, రవీందర్, రాజేందర్ రెడ్డి, నాగభూషణ్, రాఘవేందర్, స్వామి, శంకరయ్య, నాగయ్య, కోటేశ్వర్, శ్రీనివాసులు, ప్రశాంత్, ఆంజనేయులు, నరేష్, సుమతి, పద్మ, అనిత తదితరులు ఉన్నారు.

కోనాపూర్‌లో వైద్య శిబిరం

కల్వకుర్తిరూరల్: మండలంలోని కోనాపూర్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 240 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ఇళ్లు లేని 15 మందికి ఇళ్లు నిర్మించేందుకు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో రఘుపతి, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, చంద్రకాంత్ పాటు పలువురు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కల్వకుర్తి టౌన్: మండలంలోని తుర్కలపల్లి గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. శేఖర్, శివప్రసాద్, రామకృష్ణ, నరసింహులు, రాజు, మల్లయ్య, రాజు, ఉన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పెంట్లవెల్లి: మండల కేంద్రం కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదివే విద్యార్థినికి ఓ యువకుడు మాయామాటలు చెప్పి ఆదివారం సాయంత్రం అక్కడి నుంచి తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సోమవారం వసతిగృహానికి వచ్చి ఆరా తీయగా.. విద్యార్థిని కనిపించలేదు. దీంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మాట్లాడుకుని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి, విషయాన్ని ఎస్ఐకి తెలియజేశారు. దాంతో ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి విషయం కనుక్కొని అమ్మాయిని తీసుకెళ్లిన యువకుడికి ఫోన్‌చేసి మాట్లాడారు. సదరు యువకుడు విద్యార్థినిని తీసుకొస్తున్నానని తెలియజేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలియజేశారు.

బీఆర్ఎస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బీరం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చుకాయపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు 40 మంది సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ చేరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు,

కాంగ్రెస్ యూత్ కమిటీ ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో కాంగ్రెస్ గ్రామ యూత్ కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు యూత్ మండల అధ్యక్షుడు రసూల్ తెలిపారు. అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షుడిగా జగన్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, మహేష్, గణేష్, శివుడు, శివశంకర్, జగదీష్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేకర్‌రెడ్డి, నాగబాబులు పాల్గొన్నారు.

శివుడికి తైలాభిషేకం



వెల్దండ: మండలంలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామికి సోమవారం తైలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు స్వామివారిని సోమమతి అమావాస్య పురస్కరించుకొని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. తహసీల్దార్లు గోపాల్, వెంకటేశ్వర్లు, ఆయాశాఖల అధికారులు ఎల్లారెడ్డి, రవీందర్, అంజి ప్రసాద్‌రావు, అనసూయమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలకు రూ.80 వేల విరాళం

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరు ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన కిషన్‌రావు విద్యార్థులకు చదువు బోధించేందుకు వలంటీర్‌ను నియమించాడు. ప్రతి నెలవారీగా జీతం చెల్లించేందుకు సంవత్సరానికి అవసరమయ్యే మొత్తం రూ.85 వేలు ఆయన విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను గ్రామస్తులు అభినందించి సన్మానించారు.

రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



చారకొండ: వాహనదారులు రోడ్డు నియమనిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రవి హెచ్చరించారు. మండల కేంద్రంలోని దేవరకొండ, కల్వకుర్తి ప్రధాన రహదారిపై సోమవారం పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, ధ్రువ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

వృద్ధుడి అదృశ్యం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు సలిచీమల బాలసాయిలు(71) అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బాలసాయిలుకు మతిస్థిమితం సరిగ్గా లేదు. జూన్ 7వ తేదీ ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బాలసాయిలు కుమారుడు శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను దూషిస్తే సహించం


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బిజినేపల్లి: నియోజక వర్గ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండల అధ్యక్షుడు పుల్లేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసినా దామోదర్‌రెడ్డిని ప్రజలు ఆదరించలేదని విమర్శించారు. ప్రజలకోసం పనిచేసే ఎమ్మెల్యేను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దమ్ముంటే ఎమ్మెల్యే మర్రిపై దామోదర్‌రెడ్డి గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్మయ్య, వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, ఎంపీటీసీలు మంగి విజయ్, తిరుపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్ వాసికి ఆదర్శ స్వర్ణ నంది అవార్డు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన నారాయణకు ఐకాన్, ఆదర్శ స్వర్ణ నంది అవార్డు వరించింది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడు చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు ఇచ్చారని విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. సోమవారం గ్రామానికి చేరుకోవడంతో స్థానికులు ఆయనను శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.


అవార్డు అందుకుంటున్న మంతటి నారాయణ

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ


భూమి చేస్తున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే, మహేంద్రనాథ్ విగ్రహాల ఏర్పాటుకు ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, బీజేపీ నాయకుడు రవీంద్రనాథ్‌లు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులను మరిచిపోవద్దని సూచించారు. వారి అడుగుజాడల్లో యువత నడవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యం, గోపాల్‌రావు, విష్ణు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి మహేంద్రనాథ్‌కు నివాళి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జాతీయ ఉన్నత పాఠశాల ఆవరణలో మహేంద్రనాథ్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహేంద్రనాథ్ 18వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వంకేశ్వరం శ్రీనివాసులు, కొత్త పరశురాములు, మాజీ ఎంపీటీసీ గంగాధర్, మిద్దె భాస్కర్, నిరంజన్, టౌన్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు వెంకటస్వామి, శ్రావణ్, విష్ణుమూర్తి, ట్రాక్టర్ నిరంజన్, కర్ణ, సుబ్బయ్య పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మాజీ మంత్రి మహేంద్రనాథ్ వర్ధంతిని సోమవారం పట్టణంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్‌తో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు ఎదుట ఉన్న మహేంద్రనాథ్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న యువజన సంఘం సభ్యులు

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో పట్టుబడ్డ వాహనం

కల్వకుర్తి: పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా 37 బస్తాలతో వెళ్తున్న ఆటోను పట్టుకుని సోమవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. పట్టుబడిన బియ్యంపై విచారణ చేపట్టగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సత్యసాయి రైస్ మిల్ నుంచి కల్వకుర్తి పట్టణంలోని దేవీ రైస్‌మిల్‌కు బియ్యం తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. మొత్తం 18 క్వింటాళ్ల 50 కేజీల బియ్యాన్ని సీజ్ చేసి బియ్యాన్ని తరలిస్తున్న కృష్ణయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విశ్వబ్రాహ్మణ బహిరంగ సభ



అచ్చంపేట రూరల్: ఈనెల 18న జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో నిర్వహించే విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పట్టణ నాయకులు నాగరాజుచారి, ఉమాశంకర్, డాక్టర్ యూఎల్ చారి, గోపాలాచారి కోరారు. కోరారు. సోమవారం పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మురళి, వీరాచారి, మాధవాచారి, జంగాచారి, శేఖర్, కల్పన, అర్చన, విద్యావతి పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: ఒకరి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురు కారు, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పెద్దాపూర్ గ్రామానికి చెందిన నర్సింహా కల్వకుర్తి నుంచి గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీ కొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న నర్సింహకు స్వల్పగాయాలయ్యాయి. బాధితుడి చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో చౌడేశ్వరిదేవి జయంతిని సోమవారం సుకుట వీర క్షత్రీయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారికి జలక్షీర, కుంకుమాభిషేకం, కుంకుమార్చన, ఆభరణాల అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



సర్పంచ్ కుమారుడిపై కేసు నమోదు చేయాలి

అచ్చంపేట రూరల్: మండలంలోని ఐనోల్ గ్రామ శివారులో భూములను కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న రైతులను ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ డిమాండ్ చేశారు. గ్రామ శివారులోని ఐదు ఎకరాల భూమిలో మహిళా రైతు విజ్జి పత్తి పంట సాగు చేసింది. మొలకల దశలో ఉన్న పంటను సర్పంచ్ కుమారుడు దౌర్జన్యంగా ధ్వంసం చేశాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు పంటను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటను నాశనం చేసిన బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


పత్తి మొలకలను పరిశీలిస్తున్న వంశీకృష్ణ

సారా పట్టివేత: కేసు నమోదు

బల్మూర్: మండలంలోని నర్సాయపల్లి స్టేజీ వద్ద సోమవారం అక్రమంగా తరలిస్తున్న సారాను పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ సతీష్‌కుమార్, బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం నర్సాయపల్లి గ్రామానికి చెందిన రాజేందర్ బైక్‌పై నాలుగు లీటర్ల సారాను తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు బైక్‌ను తనిఖీ చేయగా సారాను అక్రమంగా తరలిస్తునట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని బైక్‌ను సీజ్ చేసి వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది ఆసీఫ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్వకుర్తి టౌన్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించారు. ధ్రువపత్రాలు చూపించాలని డ్రైవర్‌ను కోరగా పొంతనలేని సమాధానం చెప్పాడు. మండలంలోని రఘుపతిపేట వాగు నుంచి పట్టణానికి ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమాని మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



మన్ననూర్: అచ్చంపేట పట్టణ శివారులో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణానికి విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సీనియర్ గురుస్వామి వెంకటరమణ దంపతులు రూ: 1,00,116 విరాళంగా అందజేశారు. గతంతో దాత 26 సార్లు అయ్యప్ప మాల ధరించి స్వామివారిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. అనంతరం దాతను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, అయ్యప్ప సేవా సమితి ప్రధాన కార్యదర్శి కటకం రఘు, వెంకటేష్, ప్రమోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని గొల్లోనిపల్లి గ్రామానికి చెందిన రాజు హైదరాబాద్ రామాంతపూర్ బిల్డింగ్ పనులు చేస్తుండగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్, సింగల్‌విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్ సోమవారం బాధితుడికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కోడేరు: మండలంలో పస్పుల చెందిన నల్లవోతుల స్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మిద్దెశాంతయ్య, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తాడూరు: మండలంలోని మేడిపూర్ ఉప సర్పంచ్ మాధవ్ తల్లి వెంకటమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలంగాణ డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ కె రాజేష్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ రోహిణి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్, ముత్యాలాచారి, రమేష్ ఉన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని 20వ వార్డుకు చెందిన కడప ఇందిరమ్మ(60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట కౌన్సిలర్ రహీంపాషా, నాగరాజు ఉన్నారు.

ఇంటింటికీ బీజేపీ



కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్, మాచినేనిపల్లి గ్రామాలలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను గ్రామస్తులకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. రాష్ట్రంలో నియంతపాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయికృష్ణ గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్ర, పోలె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం ఆందోళనలు

చారకొండ: రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, శంకర్, నర్సింహ్మ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: రైతుల రుణమాఫీ చేయకుంటే బ్యాంకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపడతామని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తిపై ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వివరాల ప్రకారం కాలనీకి చెందిన గోపాల్‌కు కొన్ని నెలల నుంచి బంధువులతో తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇరువురు కుటుంబ సభ్యుల మధ్య మాటామాటా పెరిగి గోపాల్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించుదాం

చారకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నాయని వెంటనే గద్దెదించాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ చిల్వేరు శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. నారాయణ రెడ్డి, శ్రీను, సత్యం తదితరులు ఉన్నారు.

యాదయ్యకు సన్మానం

కల్వకుర్తిరూరల్: లారీ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన యాదయ్యను సోమవారం ముదిరాజ్ యువజన సంఘం మత్స్య పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో భీమయ్య, మహేష్, శ్రీనివాసులు, సూరి తదితరులు పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన జిల్లా నాయకుడు

కల్వకుర్తిరూరల్: హైదరాబాద్ లోని ఎల్బీనగర్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న సాయిశ్రీని సోమవారం ఆమె కార్యాలయంలో భారత విద్యార్థి సమితి జిల్లా నాయకుడు ఆనంద్‌గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాజుగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.